వినిపించని వేదన

కోరుకొండ సత్యానంద్

ఆషాఢం పూర్తయిపోయిన వెంటనే అత్తారింటికి పరుగుతీసే కొత్త అల్లుడిలా వేగంగా పరుగులు తీస్తోంది రైలు ఆ రైలు వేగానికి భయపడేనేమో అన్నట్లుగా వృద్ధభానుడు పడమటి కొండల మాటకు ఒదిగిపోతున్నాడు...

ఆ రైల్లో టూ టైర్ కంపార్ట్‌మెంటులో పై బెర్తు మీద పడుకున్నాడు చక్రపాణి. అతను నిద్రపోలేదు. ఆలోచిస్తున్నాడు.. ఎడతెరపి లేకుండా ఆలోచిస్తున్నాడు ఆలోచిస్తూ ఊహిస్తున్నాడు.. ఆ హాల్లో ఒక నిండు హృదయం ఉన్న రూపాన్ని చూస్తున్నాడు చూస్తూ కల కంటున్నాడు... ఆ కలలో కరిగిపోతున్నాడు

అతని దృష్టిలో ఆ ప్రక్కవాళ్ళెవ్వరూ లేరు .. ఆ ప్రక్కవాళ్ళెవ్వరికీ అక్కడున్నది చక్రపాణి అని తెలీదు.. తెలిస్తే అతన్ని బతకనివ్వరు.... చంపేస్తారు ప్రశ్నల వర్షంలో ముంచేసి, అభిమానపు కౌగిలిలో బంధించేసి చంపేస్తారు

చక్రపాణి ఆలోచిస్తున్నదీ, ఊహిస్తున్నదీ, ఆతృతపడుతున్నదీ 'ఆమె' గురించి ఇన్నాళ్ళూ అక్షరాల్లో కవ్వించిన ఆమె మనసు ఒంపుసొంపులు గురించి ఆమె అభిమాన చందన సుగంధాల గురించి.

ఒకప్పుడు స్వప్న చక్రపాణి అభిమాని ఇప్పుడు చక్రపాణి ఆమె అభిమాని ఆమె కథకురాలు కాదు... అక్షరాల్లో ఆత్మీయతాభావాన్ని వెల్లువలా కురిపించి, మైమరిపించే అభిమానురాలు

ఒప్పించే ఓర్పు కవ్వించే నేర్పు ఆమె అక్షరాలకుంది

ఆమె మనసు చక్రపాణికి తెలుసు.. ఎందుకంటే ఆమె వ్రాసిన ఉత్తరాల

వరంపరలో పదాల పరిమళాన్ని కలిపి చూస్తే కన్పించే ఆ రూపమే ఆమె మనసని చక్రపాణి అనుకున్న విషయం, నమ్మిన నిజం అతను నమ్మిన నమ్మకం నమ్మ కాదన్నది అతని నమ్మకం

ఆమె ఉత్తరాల్లో ఎన్నెన్ని భావాలు పలికింది ? ఇంకెన్నెన్ని అర్థాల్ని వివరించింది ? తనకే తెలుసుననుకున్న విషయాలు, తనకు కన్పించినా పట్టించుకోని చిన్న విషయాలు ఎన్నో వివరించింది . ఆమె వ్రాసిన ప్రతి ఉత్తరంలోని ప్రతి పదం చక్రపాణికి గుర్తుంది అన్నీ మననం చేసుకుంటే ఇరవైనాలుగ్గంటలూ సరిపోవన్నది అతిశయోక్తి కాదు

నడచింది మూడ్నాళ్ళ స్నేహమే అయినా ఆమె అతని మనసు నిండి పోయింది అతని రచనల్ని మరో అందమైన మార్గంవైపుకు మళ్ళించింది.

కళకొక అందమైన కన్నె తోడైతే అదెన్ని వన్నెల్ని అలరించుకుంటుందో !

ఇది చక్రపాణి విషయంలో నిజమయ్యింది ఆమె స్నేహసౌగంధాలు పీల్చి, విజృంభించి అతనెన్ని రచనలు చేసాడో ? ఆ రచనల్లో ఎంత మాధుర్యం కన్పించిందో ? అతని కెంత పేరు వచ్చిందో ?

అతను ఆమెకు ఎంత ఋణపడి ఉన్నాడో !? ఆమెతో పాటూ ఆమెను, అతనిని కలిపిన ఆ మైకు నచ్చిన ఒకప్పటి కథకు ఇంకెంత ఋణపడిఉన్నాడో ।

ఆ ఋణాన్ని తీర్చుకోడానికేగా ఇప్పుడు తను వెళ్తుంది . స్నేహితురాల్ని, పెళ్ళికూతుర్ని చూడ్డం ఒకేసారి జరిగిపోతుంది

పెళ్ళి పెళ్ళిగాని, కన్నెపిల్లగానీ గుర్తొస్తే అందరిలానే చక్రపాణి ఒళ్ళు కూడా పులకరిస్తుంది మనసు పరవశిస్తుంది కానీ, వెంటనే ఆ ఆనందం అణగారిపోతుంది అప్పుడే అతని మనసు ఆలోచిస్తుంది తీవ్రంగా ఆలోచిస్తుంది ఆ ఆలోచనల్లో వణికిపోతాడు, భయపడిపోతాడు। బెంబేలు పడిపోతాడు అప్పుడే అతని గుండె జారిపోతుంది... గుండెలో నిశ్శబ్దం నిండిపోతుంది మనసు మంచుగడ్డలా మారిపోతుంది

ఇలాంటి తీయని స్వప్నంలో ఊయల లూగిస్తున్న స్వప్న నన్ను నన్నంగీకరిస్తుందా । తన మైత్రని గుండెల్పై విశ్రాంతి తీసుకోనిస్తుందా? ఓదార్పులేని హృదయానికి సేదనిస్తుందా ?

కళాకారుడిగా నన్ని లోకం అంగీకరించినా, అభిమానించినా, మనిషిగా నన్ను దగ్గరకు రానిస్తుందా ? అందులోనూ కన్నెపిల్ల- అందమైన, బలమైన అలంబనకోసం ఆరాటపడే ఆడపిల్ల నన్ను భర్తగా ఊహించుకోగలుగుతుందా ? స్వప్న స్వప్నకు అంత

విశాలహృదయం ఉందా!

ఉంటుంది తప్పకుండా ఉంటుంది. ఆ పదాల పొందిక చెప్తుంది ఆ విషయం.. ఆ వింత భావాలు, లోతైన మాటలు ఆమె అసలు మనసును చూపిస్తున్నాయి.. ఆ ముత్యాల అక్షరాలే 'నేను నీకు అంకితం' అన్నట్లుంటాయి మరింకెందుకు భయం?

ఆలోచనలు ఒకటే ఆలోచనలు.. సుదూర తీరాన ఉన్న స్వప్న గురించే చక్రపాణి ఆలోచనలు మెదడను ఆవిరిచేసే ఆలోచనలు హృదయంలో అమృతం నింపేసే ఆలోచనలు ....గుండె లోతుల్లో సెలయేరు గలగలలు వినిపింపజేసే ఆలోచనలు ఆగిపోని ఆలోచనలు ఆమెకు అర్పించుకున్న భావాలోచనలు ఆ ఆలోచనల్లో ఎన్నో అనుభూతులు మళ్ళీ మళ్ళీ మననంచేసుకునే మధురానుభూతులు ఆ ఆలోచనల్లోనే కలిసిపోయాడు

* * *

తెలతెలవారుతుండగా

రోజూ వచ్చే తీయని కలలోంచి తేరుకున్నాడు చక్రపాణి ఆగిపోక, కలసిపోక పరుగులు తీస్తూనే ఉంది రైలు పట్టువదలని విక్రమార్కునిలా

చక్రపాణి బెర్తు దిగి క్రిందకు వచ్చాడు.. అక్కడ యించుమించు అందరూ పడుకునే ఉన్నారు.. ఎవరో కొందరు సిగరట్లు కాల్చుకుంటూ కిటికీలోంచి తదేకంగా ఏదో ఆలోచిస్తూ కూర్చున్నారు

టాయిలెట్ లోకి వెళ్ళి తలుపు వేసుకున్నాడు

లోపలున్న లైటు వెలుతురులో అక్కడున్న అద్దంలో అతని ముఖం స్పష్టంగా కన్పిస్తోంది అప్పుడే అలాంటి సమయంలోనే అంటమైన తర్వాత వికారంగా తన వైపు చూసినప్పుడే చక్రపాణి చలించిపోయాడు వణికిపోయాడు బెదిరిపోయాడు

ఆ అద్దంలో తన బింబం ముఖబింబం వికారంగా, అసహ్యంగా, ఎగుడుదిగుడుగా, వంకరటింకరగా కన్పిస్తోంది అలా ఒంటరిగా ఉన్నప్పుడు ఒక్క క్షణం అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకున్నప్పుడు చక్రపాణి గుండెను ఎవరో బలంగా పిసికేసినట్లు ఫీలౌతాడు ఎక్కడున్న ప్రతి ప్రాణంగాని వస్తువు ప్రాణం వచ్చి, తనవేపు చూసి నవ్వి, కేరింతలు కొట్టి, వింతగా, వెటకారంగ గెంతుతున్నట్లుగా, ఒక చిన్నపిల్ల పెద్దవాళ్ళని ఏప్రిల్ ఫూల్ చేసినప్పుడు ఎంత ఇదిగా నవ్వుతుందో అంతలా, తనను చూసి నవ్వినట్లుగా అన్పిస్తుంది

కట్టుకున్న ఊహల మేడలన్నీ కూలి తన వికృతరూపంమీద పడిపోయినట్లు... పరిస్థితులు పరిహాసించి నవ్వినట్లు అన్పి

స్తుంది ఆ సమయంలో చక్రపాణికి.. గుండెను ఎంతలా రాయిచేసు కున్నా తనను తాను ఎంతలా సంభా ళించుకున్నా అద్దంముందు కొచ్చే సరికి, తన రూపం తన కళ్ళకు దర్శన మిచ్చేసరికి అన్నీపటాపంచలై పోతాయి.. విప్పుల్లో తన గుండె పడిపోయినట్లని పిస్తుంది

అలా కొంతసేపయ్యాక పగిలిపో తున్న మెదడులోంచి, గజిబిజిగా తయా రైన ఆలోచనల్లోంచి ఒక రూపం . సుందర స్వప్నంలో సుందర రూపంలా.. ఊహాసుందరి స్వప్న నడుచుకుంటూ వస్తుంది ఆమె ఏవేవో మాట్లాడు తున్నట్లు, తాను వింటున్నట్లు ఆ మాటల్లో తాను సేదతీర్చుకుంటున్నట్లుగా అన్పి స్తుందతనికి

ఒక ఒరలో రెండు కత్తులు ఇమ దవు. . అలాగే ఒక మనసులో ఇద్దరికి స్థానం ఉండదు ఔనా రచయిత గారూ!?

వలపెరుంగక బ్రతికి కులికి మురిసే కంటె వలచి విఫలమొంది విలపించిన మేలురా! అని అన్నారెవరో మనిషి పుట్టింది చచ్చిపోవటానికే జననం తర్వాత మనిషికి శరణమయ్యే గమ్యం మరణమే! కాకపోతే ఒక అనుబంధాన్ని పెనవేసుకోవడంలో ఉన్న ఆనందాన్ని అనుభవించిపోతే తప్ప అదృష్టవంతుడు కాలేడు

నేనెప్పుడూ అశుభాలు పలుకుతానని నీ కెప్పుడూ కోపం వస్తుంది కదూ!? కీడెంచి మేలెంచమన్నారు చీకటి తర్వాత వెలుతురొస్తుంది. వెలుతురు పోయాక చీకటి తప్పకుండా వస్తుంది . ఈ జీవితంలోకూడా కీడు, మేలు అని రెండు రకాలున్నాయి .. మేలును ముందనుభవిస్తూ వచ్చేకీడును ఆలోచిస్తూ భయపడేకంటే, కీడనుభవిస్తూ వచ్చే మేలును ఆశించి ఆనందించడం ఎంతో హాయిగా ఉండదూ!?

మనం దూరంగా ఉన్నాం మన మనసులు ఎప్పుడూ పలకరించుకుంటూ పరవశించిపోతుంటాయి కదూ!?

ప్రేమకు కళ్ళు లేవు.. ఔను నిజం దానికి కళ్ళు లేవు ఉన్నవి మనసు, చెవులే! దానికి కావాల్సింది మధురమైన మాటలు, మారిపోని బాసలు, వాడిపోని ఊహలు, ఒక మంచిమనసు... అంతే! ఏమంటావ్ చక్రా?

మల్లెపూవుకంటె దాని వాసన ఎంతో బాగుంటుంది అలాగే మనిషి కంటె అతని మనసు అందంగా ఉండాలి నేను కోరుకునేది, కావాలనుకునేది అదే!

మనిషి కంటే కోయిలంటేనే నా కిష్టం ఎదుకంటే దాని గొంతులో హొయలు దాని అందంలేవితనాన్ని మరిపించేస్తుంది మనసులోని అందం వాకు కన్పిస్తుంది ఎలా? అని అడిగితే నేను చప్పలేను

అలా స్వప్న వ్రాసిన ఉత్తరాల్లోని కొన్ని మాటలు గుర్తుకొచ్చి అతని ఆత్మ కడలిలోని ఆలోచనా కెరటాల విజృంభణ తగ్గుముఖం పడుతుంది మండిపోతున్న మనసుకు చల్లగాలి తగులుతుంది.

చెమట పట్టిన ముఖాన్ని నీళ్ళతో కడుక్కొన్ని, తుడుచుకుంటూ బయటకు వచ్చాడు

• • •

చక్రపాణి సూట్ కేస్ తెరిచాడు అందులోంచి ఓ ఉత్తరం తీసి మడత విప్పి చదవడం మొదలుపెట్టాడు ఆ ఉత్తరం స్వప్న ఆఖరిసారిగా వ్రాసిన ఉత్తరం .

చక్రా !

ఎలా ఉన్నావు ? ఈ ఉత్తరంలో ఒక మంచి విషయం ఉంది... ఇన్నాళ్ళూ మనసులు ఉత్తరాల ద్వారా ఊసులాడు కున్నామే కానీ, ఒకరావికొకరిటి ఎదురు అవలేదు. కానీ ఇప్పుడా అవసరం వచ్చింది మా ఇంట్లో అందరికీ మన విషయం తెలుసు మనల్ని కలపాల న్నదే వాళ్ళ ఆరాటంలోని అంతరార్థం... ఇన్నాళ్ళూ నాకా ఆలోచన రాకపోయినా ఇప్పుడెందుకో పదే పదే నీ రాకకోసం, మన వివాహంకోసం ఆలోచిస్తున్నాను... అందుకే నువ్వు సోమవారం సాయంత్రం నా దగ్గర కెలాగైనా రావాలి

రైల్వేస్టేషన్లో దిగి అక్కడ సిటీ బస్ గానీ, ఆటోగానీ ఎక్కి 'గాంధీగ్రాం' అంటే వాడు తీసుకొస్తాడు... అక్కడ ఒకే ఒక జూనియర్ కాలేజి ఉంది ఆటో అయితే అక్కడేదిగొచ్చు... ఆ రోడ్డు కాలేజి వెనకభాగం నుండి ఆ కాలనీ కాంపౌండ్ వాల్ ను కట్ చేసి అక్కడుండే యారాడ కొండమీదకు పోతుంది ఆ రోడ్డుమీదనుండి నడుచు కుంటూ వస్తే నాలుగో మలుపులో గట్టుమీద ఎర్రచీర, ఎర్ర జాకెట్టు తొడు క్కొని నువ్వు వ్రాసిన 'వినిపించని వేదన' నవల పట్టుకొని ఉంటాను . నువ్వు అక్కడకు రాకపోతే నేను ఎప్పటికీ ఆ కొండ దిగరాను

ఈ ఉత్తరం వ్రాస్తుంటే నా చేతు లెందుకో వణుకుతున్నాయి చక్రా ! గమ్యం చేరువౌతున్నకొద్దీ కాళ్ళు పీకేస్తు న్నట్లుగా, కాలం గడుస్తున్నకొద్దీ మన సులో తహతహ మరీ ఎక్కువై పోతుంది నాకు

ఎక్కడో కొండమీదకు రమ్మంటుం దేమిటా ? అని కదూ నువ్వు ఆలోచి స్తున్నావు ? ఆ ప్రదేశం నా కిష్టం .. ఆ ప్రకృతిలో ప్రశాంతత నా అభిమాన ధనం నా కిష్టమైన వ్యక్తిని మొటమొ దట అక్కడే చూడాలన్నది నా కోరిక... కాదనవు కదూ !! ఆ తర్వాత నేను, నువ్వు జంటగా మా ఇంటికి వెళ్దాం.... ఉంటానూ.. కాబోయే నీ....

స్వప్న.

ఉత్తరాన్ని మడిచి జేబులో పెట్టుకొని బయలుదేరాడు చక్రపాణి

* * *

అదో జోరుగా వస్తోంది వీచే చల్లగాలికి చక్రపాణి మేను పులకిస్తోంది వచ్చే ఊహలకు అతని మనసు పరవశిస్తోంది

ఆటో జూనియర్ కాలేజిరోడ్డు దగ్గర ఆగింది దిగి డబ్బులిచ్చేసాడు చక్రపాణి ఆటో తిరిగి వెళ్ళిపోయింది

చక్రపాణి చుట్టూ ఒక్కసారి చూసాడు నిర్మానుష్యంగా ఉంది ఆ ప్రదేశం అక్కడక్కడా ఒకరిద్దరు నడుస్తూ కన్పించారు కుడిచేతి వైపు దూరంగా చిన్న కొండమీద శివాలయం, కొంచెం ముందుపిర్డి సాయిబాబా ఆలయం, ఎడమ ప్రక్క విశాలమైన అందమైన కాలేజి . కాస్త మెనగ్గా పెద్ద గ్రౌండ్., ఆ గ్రౌండ్ ఆనుకొని పెద్ద కొండ

చక్రపాణి ముందుకు కదిలాడు

అతని హృదయంలో అత్భుత ఏడు గుర్రాల జోరులో ఉంది ఏదో తహ తహ కొంచెంత ఎదిగిపోతుంది

అతను ఊహిస్తున్నది వ్వప్న రూపం గురించి కాదు అమె ప్రవర్తన గురించి అతను ఆలోచిస్తుంది ఆమె అందచందాల గురించి కాదు అభిమాన అనురాగాలు సంగమించిన అందమైన మనస్సు గురించి . అతను కోరుకుంటున్నది అందమైన ఆమె శరీరాన్ని కాదు . తన్నానందింపజేసే సంస్కార సుగుణాన్ని

అక్కడ రోడ్డు సిమెంటురోడ్డుతో కలిసింది అది కొండమీదకు దారి తీసింది

పాదవడి అడుగులేద్దామనుకుంటే కాళ్ళి తడబడుతున్నాయి నెమ్మదిగా వెళ్దామంటే మనసు తొందరపడి ముందుకు తోపేస్తుంది

ఇంకాస్త దూరం నడిస్తే ఆ కొండ చేరువౌతుంది ఈ దారిలోంచే నా చెలి వెళ్ళి ఉంటుంది ఈ దారి చివరనే ఆమె నాకోసం ఎదురుచూస్తుంటుంది...

ఈ దారే తననేంచేసినా ! నన్ను మెచ్చి నా చెలి చెంత చేరినా, ఈసడించి ఏవగింపుగా మాట్లాడి అవమానపరచినా, ఈ దారిలోనే జరిగిపోతుంది.

ఛ స్వప్న అలా ప్రవర్తించదు

అలాంటిదే అయితే నా ఫోటో పంపమని ఒకసారి ముచ్చటగా వ్రాసినా తను భయపడి పంపలేదు ఏమను కుందో ఏమో ఆ విషయాన్ని మళ్ళీ ఎప్పుడూ వ్రాయలేదు

కొండగాలి చక్రపాణికి స్వాగతం పలుకుతోంది సిమెంటు రోడ్డుమీద నడుస్తుంటే ఆ దారి తన కాలిని స్పర్శిస్తుంటే అదో అనుభూతి, మరేదో ఆనందం కలుగుతోంది

ప్రక్కనే కాలేజీ ప్రహరీ గోడ ఎదురుగా ఆ కాలనీ కాంపౌండ్ వాల్

.... ఆ కొండమీదకు పోయే ఈ దారి కోసం చిన్న ద్వారం

ఆ ద్వారం దాటాడు చక్రపాణి... అతను వెనక్కి తిరిగి చూడలేదు.... చూసుంటే ఎలా ఉండేదో గానీ అతను చూడలేదు

అతని జీవితంలో అదృష్టంలోంచి దురదృష్టం తిరిగిచూస్తుంది దుర దృష్టంలోంచి అదృష్టం తిరిగిచూస్తుంది .... అందుకేనేమో అతను వెనక్కి తిరిగి చూడలేదు

ఆ రోడ్డు తెల్లగా, ఎత్తుగా, వంపుగా ఎంతో రమణీయంగా ఉంది

ఈ దారి ప్రకృతి స్వర్గానికి దారి ... నా దేవత గుడికి వేసిన ముత్యాల బాట అని అనుకున్నాడు చక్రపాణి.

ఇన్నాళ్ళూ అతను దేన్ని గురించి ఒక్కసారిగా కృంగిపోయాడో అది అసలతనికి గుర్తేలేదు అది ఆ దారి మహిమేనేమో।।

ప్రేమ పరిపక్వదశకు వస్తే మనసు సంతృప్తితో నిండిపోతుంది అందో ళన ఆవిరైపోతుంది

ఇన్నాళ్ళూ ఎరుగని ఏదో హాయి తేలికదనం పొందుతున్నాడు చక్రపాణి రోడ్డుమీద కొంచెం కొంచెం ముందుకు నడుస్తుంటే భూమ్మీద పచ్చరంగు ఒలికిపోయినట్లున్న ప్రకృతి అందాలు కనిపిస్తున్నాయి ఆకాశాన్ని ముద్దు పెట్టుకున్నట్లున్నశిలాగ్రాలు, ఆకొండల మధ్యలో పల్లెటూరిపిల్ల పాలభాగాన కుంకుమ బొట్టులా ఉన్న సూర్యబింబం

ఇవేమీ చక్రపాణి గమనించడం లేదు

అతను చూసేది ఎదురుచూపులే .. ఆ చూపుల్లో ఆతృత 'ఆమె' కోసమే

స్వప్నాలను నిజంచేయబోతున్న స్వప్న కోసమే

కష్టంగా ఉన్నా గబగబా ఎక్కు తున్నాడు... కమలాపు కూడా తిరిగాడు...

అక్కడ ఆ రూపం ఆమె రూపం ఆమె చేతిలో 'వినిపించని వేదన' పుస్తకం

చక్రపాణి కళ్ళు చెదిరిపోయాయి . పచ్చని ప్రకృతి, తెల్లని ఆమె మేను, రెపరెపలాడుతున్న ఆమె చీర చెంగు.... ఇదంతా, ఆ ప్రదేశమంతా భరతమాత కట్టుకున్న చీరలా ఉంది.

ఇ ఇద్దరి మధ్యా పది అడుగుల దూరం

ఇన్నాళ్ళూ పరుగెత్తిన కాలం ఇప్పు డాగిపోయినట్లయ్యింది .... పరుగెత్తి, పరుగెత్తి అలసిపోయినట్లుంది .

ఆమె కళ్ళల్లో వింత భావం ఉంది . . సమస్త కళలూ సంగమించిన ఓ శరీరం ఆమె మోములో ప్రతిబింబించి నట్లుంది పదేపదే పలికిన పదం ... పేరు స్వప్న . అన్న రెండక్షరాలు ఇప్పుడు పలుకుదామని ఉంది - ఆవే శంగా, ఉద్వేగంతో పిలవాలని ఉంది .



కానీ, గొంతుక్కి ఏదో అడ్డుపడినట్లుగా ఉంది .... అది పొంగి పొరలుతున్న ప్రేమా? ఎగిరి గంతులేస్తున్న అభిమానమా? ఉద్రూతలూగుతున్న ఉద్రేకమా? ఉయ్యాల లూగుతున్న ఆనందమా? కళ్ళెంలేని కోరికల పరంపరా? ఏమిటి? ఏమిటి?

అది భాష కందని భావం.... ఆ భావంతో అతని పెదవులు వణికిపోతున్నాయి. వడగళ్ళ వాన పడినట్లు, వరదొచ్చేస్తున్నట్లు, ఆమని ఆనందతాండవం చేస్తున్నట్లు.... ఏదో, ఏదోలా, విప్పలేని వింత భావాలు, రాగాలు.... రవళిస్తున్నాయి....

అతి కష్టంతో పెదవుల్లోంచి ఒక పదం బయటపడింది....

'స్వ... ప్నా.... !'

బరువుగా, బొంగురుగా వచ్చిందా పిలుపు.... ఆ బరువులో ఆవేదన ఉంది .... ఆ బొంగురులో ఆరాధన ఉంది....

నల్లని కళ్ళు అందంగా చూసాయి ... . అతన్ని పరికించి చూసాయి....

మామూలు జోళ్ళు, లూజు షరాయి, లాల్చీ, వాటిలో సన్నగా పీలగా ఉన్న శరీరం, దళసరి అద్దాలు, వాటిల్లోంచి కన్పిస్తున్న భూతం కళ్ళు, దళసరి కనుబొమలు, చిన్న ఎర్రని తల.... నల్లని రంగుతో ఉన్న చక్రపాణి కన్పించాడు....

'స్వప్నా !'

ఆ పిలుపుతో ఆమెలో చప్పున ఓ భావం మెదిలింది....

ఎందుకో ఆమె తల క్రిందకు వాల్చేసింది....

అంతే! అతను ఆ రోడ్డు మొదట్లో మరచిపోయిన ఆలోచనలు.... మళ్ళీ, మళ్ళీ.... పెనుగాలిలా.... సుడిగాలిలా .... తుఫానులా .... చెలరేగిపోయాయి .... కానీ, అతనిలోని భావాల పరంపర పెల్లుబికింది....

'స్వప్నా! స్వప్నా! ఏమిటి స్వప్నా? ఇదేమిటి? నీ కోపం ఇన్నాళ్ళూ కాచుకొని ఉంది, నీ ఉత్తరం అందగానే పరుగెత్తి అలసి సొలసి వచ్చిన నాకిచ్చే స్వాగతం ఇదేనా? పలికే మొదటి మాట మౌనమా?'

ఆమె ఒక్కసారి తల పైకెత్తి చూసింది. ఆ కళ్ళలో ఒక భావం కన్పించింది చక్రపాణికి.

అదే.... అదే ఆ భావం పేరు, ముద్దు పేరు, అసలు పేరు అసహ్యమే!

ఎప్పటివో మాటలు గుర్తుకొచ్చాయి. అందమైన ఆడపిల్లలకు కావాల్సింది బలమైన ఆధారం, అందమైన ఆలంబన. నా ఈ చింపిరి ఆకారం కాదు. చితికిపోయిన జీవితం కాదు.

స్వప్నా! నువ్వు కూడా నువ్వు కూడా అందరిలాంటి దానివేనా? అయితే నీ వన్న మాటల కర్థం ఏమిటి? గొంతు లోంచి వచ్చిన భావుకతేనా అది? ఎండిపోయిన గోదారి గలగలలేనా అవి? స్వప్నా!

ఆమె అటువైపుకు తిరిగిపోయింది.

అంతేనా స్వప్నా! స్వప్నాల్లోనే నా బ్రతుకు కరిగిపోవాలా? నువ్వు నాకో స్వప్నంగానే మిగిలిపోవాలా?

ఆమె ఏమీ బదులివ్వలేదు. అటు వైపు నుండి తల తిప్పలేదు. వెక్కుతూ ఏడుస్తోంది...



నా రూపం చూసిందర్వాత ఆమె ఇన్నాళ్ళూ కట్టుకున్న ఆశల హర్మ్యాలు కూలిపోయాయన్నమాట.... కన్నకలలు చేదునిజాలైనాయన్నమాట! అందుకే ఆమె అంతలా బాధపడుతుంది.... తను ఊహించుకున్న రూపం నాది కాదని వెక్కి వెక్కి ఏడుస్తుంది.... మరి ఆమె ఇన్నాళ్ళూ వ్రాసిన వ్రాతల కర్థం, అంతరార్థం ఏమిటి?

అతనిలో కోపం రగులుకుంది....

"స్వప్నా! నాకు కోపం వస్తోంది.... ఆరాధనతో, చల్లదనంతోపాటు తిరగ బడితే కోపాగ్ని కూడా ఉంటుంది వలచి విఫలమవ్వడంలో హాయి ఉందని నువ్విలా ప్రవర్తిస్తున్నావా? ప్రేమకు కళ్ళులేవని నన్ను చూసి కళ్ళు మూసు కుంటున్నావా? కోయిల రూపంలో కమ్మని గొంతును వినలేవా? మనసు లోని అందం నీకు కన్పిస్తుందన్నావే, మరి నన్ను చూసి ముఖం చాటుచేసు కున్నావేం? ఇంతటి నీచమైనదానివి నన్నెందుకు ఆకర్షించావ్? సంస్కారం ఉట్టిపడే మాటలెందుకు వ్రాసావ్? అవును నాకు అందం లేదు నాకు అందం లేదు కాకిని నల్లకాకిని కానీ, నువ్వు మోసగత్తెవు ఆహా! నీలోని ఆరాధన, అభిమానం ఇదా? గుండెల్ని చింపేసే అభిమానం నీలో ఉందనుకున్నాను. గుండెలు పగిలి పోయేంత అసహ్యం ఉందా? నా గుండెలో నీకో పెద్ద గుడిని కట్టి దానిలో దేవతవు నువ్వే అనుకున్నానే కానీ ఇదా? ఛీ! ఛీ! నా దేవత ఇంత నీచమైనదా? ఈ లోకంలోని మను ష్యులు మనుష్యులు కారు రాక్షసులు కానీ, నువ్వు నువ్వు. చండాలురాలివి"

ఆమె ఒక్కసారిగా తల వెనక్కి తిప్పి. కళ్ళు పెద్దవిచేసి చూసింది ఎర్రజీరల్తో ఆమె కళ్ళు అతి భయంకరంగా ఉన్నాయి.... ఆ కళ్ళల్లో నన్నని కన్నీటి పొర ఆమె ఊగి పోతుంది కాళిలా.... ప్రళయకాల రుద్రిలా.

అతను ఆగిపోయాడు ఆ చూపుతో అతను చల్లారిపోయాడు...

"సారీ నన్ను క్షమించు స్వప్నా. సారీ, క్షమించండి ఎగురు తున్న గాలిపటం తెగిపోయి ఏ చెట్టుకో అంటుకొని ఆ చెట్టు వాని అంచే ఎలా కుదురుతుంది! కోపంలో ఏదో నోరు జారిపోయాను మనం మనుష్యులం దేవతలం కాదు. ఆశలు, కోరి కలు, ఊహలు ఉంటాయి మనకు. అందంలేని నన్ను ఆడపిల్ల కూడా కోరుకోదు ఎంతో అందం ఉన్న మీరు నన్నెలా అంగీకరించగలరు! దురాశ నా కళ్ళు కప్పేసింది నోరు జారించేసింది నన్ను క్షమించండి

అని అన్నంతలో ఆమె చేయి విసురుగా విసిరింది 'వెళ్ళిపో' అన్నట్లుగా....

అంతవరకు కనురెప్పల్లో ఒదిగి ఉన్న కన్నీరు ఉబికింది గులాబి చెంపల మీదుగా జాలువారింది ఆ చర్యకు చక్రపాణి కళ్ళవెంట కూడా కన్నీరు ఆగలేదు

నన్ను, నా రూపాన్ని చూసి ఎంతగా ఆమె నిరాశపడిందో ఉబికిన ఆ కన్నీరే చెప్తుంది అనుకుని "వెళ్ళిపోతాను ఉండమన్నా

ఉండను నేను... ఉండమనేవారు కూడా లేరు నాకు.... వస్తాను ." అని గిరుక్కున తిరిగిపోయాడు చక్రపాణి ...

అతని గుండె మండిపోతుంది. . మనసు కాలిపోతుంది . మెదడు పగిలిపోతుంది శరీరం అంతా చెమటలు, వణుకు... వివరించి చెప్పలేని వణుకు ... వల్లం వల్ల, అతనిలో ఆవేశంవల్ల అడుగులు వడిగా పడుతున్నాయి అతను వెనక్కి తిరిగి చూడలేదు

అశ నన్ను మోసం చేసింది అక్షరాల్లోనే ఆత్మీయతాభిమానాల్ని వెల్లువలా కురిసించి మోసంచేసిన వంచకురాలు..

ఆమె విషాద కథల్ని సృష్టించే కథకురాలు.... పదాల్లోని పరిమళం ప్రవర్తనలో లేదు . . అక్షరాల్లో సంస్కారం మనస్సులో లేదు... నేనోడిపోయాను కాదు... మోసపోయాను మోజు వరదలో కొట్టుకుపోయాను

అతని ఎర్రని కళ్ళలో కన్నీటి వర్షం... ఆవేదన వడగాల్పులు రక్త వరదొచ్చి గుండె పగిలిపోయేలా అంది కళ్ళు రెండూ పేలిపోతున్నట్లుగా ఉన్నాయి . అతన్ని తాకితే వేయి వోల్టుల కరెంటుషాక్ కొడ్తుందేమో అన్నట్లుగా అన్నాడు

చెమటపట్టిన ముఖం తో, చెరిగిపోయిన తలతో, ఎన్నో భావాలు మిళితమైన భావంతో, అతను పిచ్చివాడిలా ఉన్నాడు ప్రేమ బిచ్చగాడి లా ఉన్నాడు

వడివడిగా పడిన అడుగులు ఒక్కసారిగా అ క్క డ ఆగిపోయాయి ఎత్తిన కళ్ళకు అక్కడ ఆ కాలనీ కాంపౌండు వాల్ మీద . అందంగా వ్రా సి న నా లు గు అ క్ష రా లు కన్పించాయి అవి చూసిన మరుక్షణం అతని నోరు పెగల్లేదు మెదడులో ఉరుములు, మె^ పులు తాను నిల్చున్నచోట నేల పగిలి తాను కూరుకుపోయినట్లు అన్పించింది

అతన్ని వృప్న మోసంచేయలేదు.. అతన్ని అతనే మోసంచేసుకున్నాడు . అపార్థం చేసుకున్నాడు. వెళ్ళేటప్పుడు ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుంటే .. ఇప్పటికి పున్నమి వెన్నెల కురిసేది. . అభిమాన, అ ను రా గ సంకెళ్ళు పడి ఉండేవి ..

అంటే . అంటే ఇందాక ఆమె చేయి చూపించింది ఈ గోడవైపా?

అతను ఒక్కసారిగా వెనక్కి తిరిగి చూసాడు. .

ఆమె పరుగెత్తుకుంటూ వస్తోంది .. జీవిత నౌక దూరమైపోతుందన్న ఆతృత, ఆవేదన ఆ పరుగులో ఉంది. ..

ఆగలేకపోయాడు చక్రపాణి . పరుగెత్తాడు . బలహీనంగా ఉన్నా, గుండె బరువెక్కిపోతున్నా పరుగెత్తాడు.

.... ఆమె కౌగిలిలోకం కోసం .. ఆమె హృదయసామ్రాజ్యం కోసం.

ఆ కొండ మీద ఒక నిమిషం పాటు ఉరకల, పరుగుల ప్రళయం ఆ ప్రళయం సృష్టించిందో ప్రేమ కౌగిలిని కలిపిందో ప్రేమ జంటని ఆ కౌగిలిలో ప్రేమ స్నేహాల విలువ హిమాలయాల్ని దాటింది

అతను ఒగరుస్తున్నాడు. ఆమె ఆయాసపడుతోంది

భావాల పరంపరలు, అనురాగాల రవళులు ఒక్కసారిగా ఒక్కుమ్మడిగా చెలరేగిపోయాయి...

స్మృతుల స్మృతితో, అనురాగం లయంతో ప్రేమసంగీతం విప్పించింది ఆ హృదయాల్లో

"నన్ను క్షమించు స్వప్నా! నన్ను క్షమించు ఇందాకట్నుంచి నీ ముఖంలో ఆ భావాలకు కారణం ఇదా? నేను గుర్తించలేకపోయాను స్వప్నా, నన్ను క్షమించు నాకు వివరంగా నోరువిప్పి చెప్పలేని ఆ వేదన నాకు వినిపించలేదు. కానీ... కానీ ఇప్పుడు నాకు కనిపిస్తుంది... నీ మనసు కనిపిస్తుంది అందులోను అందాలు కనిపిస్తున్నాయి.. మధురమైన నీ భావాలు గుండెలోన ఉండిపోవాలని, అవి నాకే వినిపించి, అంకితమైపోవాలని, అవి గొంతుదాటి బయటకు రాగూడదని... ఆ దేవుడు నా కోసం కల్పించిన అవకాశం స్వప్నా! ఇది నా వరం... 'చెప్పలేక, నా బలహీనత సృష్టించిన విపరీత ప్రవర్తనను భరించలేక అప్పుడు నీవెంత నలిగిపోయావో, నీ మనసెంతగా కుమిలిపోయిందో ఊహిస్తేనే నా గుండె నీరైపోతుంది.... నన్ను క్షమించు స్వప్నా!"

అతని గుండెలో గువ్వలా ఒదిగిపోయిందామె ...

ఆనందంగా వర్షిస్తున్న కళ్ళు, సంతోషంతో వణుకుతున్న పెదవులు ఎవరికి వినిపించకుండా, నిశ్శబ్దంగా మాట్లాడుకుంటున్నాయి....